# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :190 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:గురువారం 02-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## చిన్న కంట్రాక్టర్లకు దసరా కానుక
## 5లక్షల వరకు చెల్లింపులకు ఆర్థిక శాఖ నిర్ణయం

అమరావతి,:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ దసరా పండుగ వేళ చిన్న కాంట్రాక్టర్లకు శుభవార్త చెప్పింది. దీంతో 2014-19 మధ్య పనులు చేసి సుదీర్ఘ కాలంగా బిల్లుల కోసం వేచిచూస్తున్న చిన్న కాంట్రాక్టర్లకు భారీ ఊరట లభించనుంది. వీరికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించారు. రూ.5 లక్షల మేర పనులు చేసిన అన్ని బిల్లులు చెల్లించాలని ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. అలాగే.. 2019 నుంచి నేటి వరకు చేపట్టిన వాటిలో రూ.5 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు కూడా చేస్తున్నట్లు ప్రకటించింది. ఆర్థిక శాఖ నిర్ణయంతో దాదాపు రూ.400 కోట్ల మేర చిన్న కాంట్రాక్టర్లకు లబ్ది చేకూరనుంది.ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు దఫాలుగా నాటి పెండింగ్ బిల్లుల చెల్లింపులను చేసుకుంటూ వచ్చింది. అయితే.. దసరా పండుగ సందర్భంగా బిల్లుల చెల్లింపుల పక్రియ భారీగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది.

## ఈ యుగంలో జాతీయ చైతన్య సద్గుణ అవతారం సంఘ్ : ప్రధాని మోదీ

న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో బుధవారం జరిగిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా రూపొందించిన స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది విజయ దశమి నుంచి 2026 విజయదశమి వరకు సంఘ్ శతాబ్దిని జరుపుంటుందని.. సంస్థ శతాబ్ది ఉత్సవాలను వీక్షించే అదృష్టం మాకు కలిగిందన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలీరామ్ హెడ్గేవార్‌కు నివాళు లర్పించారు. %విజయదశమి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రేపు విజయ దశమి అనే గొప్ప పండగను జరుపుకోబోతున్నామని.. అన్యాయంపై న్యాయం విజయం, అసత్యంపై సత్యం, చీకటిపై వెలుగు సాధించిన విషయంగా పేర్కొన్నారు. వందేళ్ల కిందట ఇంత గొప్ప పండుగ సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపన యాదృచ్ఛికం కాదన్నారు. ఇది వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం పునరుజ్జీవనం, ఆ యుగం



సవాళ్లను ఎదుర్కోవడానికి ఎప్పటికప్పుడు కొత్త అవతారాల్లో జాతీయ చైతన్యం వ్యక్తమవుతుందన్నారు.. ఈ యుగంలో సంఘ్ శాశ్వతమైన జాతీయ చైతన్యం సద్గుణ అవతారమన్నారు.

## వికిపీడియాకు కౌంటర్‌గా గ్రోకిపీడియా.. ప్రకటించిన ఎలన్ మస్క్

న్యూఢిల్లీ: స్పేస్ఎక్స్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. వికిపీడియా తరహాలో అంతకంటే మెరుగైన గ్రోకిపీడియాను డెవలప్ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన కంపెనీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ %ఇూా×% ఆ కొత్త ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాను డెవలప్ చేస్తున్నది. ఈ ప్లాట్‌ఫామ్‌కు గ్రోక్ టెక్నాలజీ వాడనున్నారు. మనుషులకు ఏఐ ఉపయోగపడే రీతిలో ఉండాలని ఎలన్ మస్క్ ఆశిస్తున్న తరహాలో కొత్త ఇన్‌సైక్లోపీడియా ఉంటుందని భావిస్తున్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో ప్రకటిస్తూ.. గ్రోకిపీడియాను డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు. వికీపీడియా కంటే అతిభారీగా ఉంటుందన్నారు. విశ్వాన్ని అర్థం చేసుకునే లక్ష్యంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికీపీడియా కన్నా చాలా విశ్వసనీయమైన, పారదర్శకమైన, భిన్నమైన, కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో గ్రోకిపీడియాను తయారు చేస్తున్నట్లు మస్క్ తెలిపారు. మస్క్ ప్రకటనపై కొందరు ఆన్‌లైన్ యూజర్లు హర్షం వ్యక్తం చేయగా,



కొందరు ఆ ప్రయత్నాన్ని తప్పుపట్టారు. గ్రోక్ ఎక్కువ శాతం వికిపీడియా డేటాను వాడుకుంటుందని, మరి గ్రోకీపీడియా ఎలా బెటర్‌గా ఉంటుందని కొందరు ప్రశ్నిస్తున్నారు.

## అంతరిక్షంలో పెళ్లికి సిద్ధమవుతున్న టామ్ క్రూజ్, ఆనా డి ఆర్మాస్

హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్, నటి అనా డి అర్మాస్ గత కొన్ని రోజులుగా డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. 63 ఏండ్లు ఉన్న టామ్ 37 ఏండ్ల అనా డితో డేటింగ్‌లో ఉన్నట్లు హాలీవుడ్‌లో పలు కథనాలు వెల్లడయ్యాయి. అయితే తాజాగా వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'డీపర్' అనే యాక్షన్ థ్రిల్లర్ సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే వీరి మధ్య సాన్నిహిత్యం పెరిగి పెళ్లి వరకు చేరిందని టాక్. అయితే వీరిద్దరూ పెళ్లికి సంబంధించిన ఒక విషయం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ జంట తమ పెళ్లిని అంతరిక్షంలో లేదా సముద్రం అడుగుభాగంలో (అండర్‌వాటర్ వెడ్డింగ్) చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఆనా డి ఆర్మాస్, టామ్ క్రూజ్ ఇద్దరికి అడ్వెంచరస్ ఫీట్స్ చేయడమంటే చాలా ఆసక్తి ఉండటంతో ఈ నిర్ణయం



తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయంపై టామ్ లేదా అన్నాడి స్పందించాల్సి ఉంది.

## మల్లికార్జున ఖర్గేకి పేస్‌మేకర్ అమర్చిన వైద్యులు

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం బెంగళూరు లోని ప్రఖ్యాత ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఖర్గే శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయనకు వైద్యులు పేస్‌మేకర్‌ను అమర్చారు . గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు దీన్ని అమరుస్తారు. ఈ విషయాన్ని ఖర్గే కుమారుడు, కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. %మంగళవారం రాత్రి మల్లికార్జున ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. ఇంట్లో స్వల్పంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. ఖర్గే ఆసుపత్రిలో చేరారన్న వార్తతో దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన మద్దతుదారులు ఆందోళనకు గురయ్యారు. ఆయన త్వరగా



కోలుకోవాలని పార్టీ సీనియర్ నాయకులు ట్వీట్ చేశారు. మల్లికార్జున్ ఖర్గే వయసు 83 సంవత్సరాలు. ఆయన సీనియర్ పార్లమెంటేరియన్. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నేతల్లో ఒకరు. అక్టోబర్ 2022 నుంచి ఆయన ఏఐసీసీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

## బీసీసీఐకి క్షమాపణలు చెప్పిన పీసీబీ చైర్మన్ నఖ్వీ..!

పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ భారత క్రికెట్ బోర్డుకు క్షమాపణలు చెప్పాడు. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ తర్వాత జరిగిన పరిణామాలకు క్షమాపణలు చెప్పినట్లుగా ఇండియా టుడే కథనం ప్రచురించింది. మంగళవారం జరిగిన ఏసీసీ సమావేశంలో నఖ్వీ క్షమాపణలు చెప్పాడంటూ విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఏసీసీ చైర్మన్‌గా ఉన్న పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ, పతకాలు అందుకునేందుకు భారత జట్టు నిరాకరించింది. ఆ తర్వాత టీమిండియా కప్‌ను లేకుండానే సంబురాలు చేసుకుంది. ఆ తర్వాత కప్‌ను నఖ్వీ మైదానం నుంచి బయటకు తీసుకువెళ్లాలని ఏసీసీ అధికారులను ఆదేశించారు.

%మంగళవారం జరిగిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో ఆసియా కప్ ట్రోఫీ వివాదంలో మొహ్సిన్ నఖ్వీ వ్యవహరించిన తీరుపై బీసీసీఐ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. సమావేశానికి హాజరైన బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రోఫీ ఏసీసీ ఆస్తి, పీసీబీ చీఫ్ ఆస్తి కాదని స్పష్టం చేశారు. ట్రోఫీ, పతకాలు హోటల్ గదికి తీసుకువెళ్లే అధికారం నఖ్వీకి లేదని గుర్తు చేశారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా జట్టుకు ట్రోఫీని సరైన పద్ధతిలో అప్పగించాలని, తక్షణమే ఏసీసీ సంరక్షణలో ఉండాలని బీసీసీఐ డిమాండ్ చేస్తోందని శుక్లా స్పష్టం చేశారు. అయితే, బీసీసీఐకి క్షమాపణలు చెప్పినప్పటికీ భారత క్రికెట్ జట్టుకు ట్రోఫీని తిరిగి ఇవ్వడానికి నఖ్వీ నిరాకరించాడు.

## లండన్‌లో 'టాక్ చేనేత బతుకమ్మ-దసరా' సంబరాలు

లండన్: తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్ డమ్(టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో చేనేత బతుకమ్మ - దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలకు యూకే నలుమూలల నుండి రెండు వేలకుపైగా ప్రవాస భారతీయ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక హౌన్‌స్లో నగర మేయర్ అమీ క్రాఫ్ట్ , తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ , టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం పాల్గొన్నారు. గత కేసిఆర్ నాయకత్వంలో చేనేతకు చేయూతనిస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన విషయం మనందరికీ తెలిసిందే. అదే స్ఫూర్తితో రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ కృషికి మా వంతు బాధ్యతగా చేనేతకు చేయూతనిస్తూ ప్రతీ సంవత్సరం లాగా నేడు కూడా వేడుకలను 'చేనేత బతుకమ్మ, దసరా'గా



జరుపుకున్నామని టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల తెలిపారు.

## కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం : కేటీఆర్

: తెలంగాణలో 2014 నుంచి పదేళ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ ద్వారా స్పందన తెలియజేశారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగమనే విషయం మరోమారు రుజువైందని ఆయన పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులవల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. 2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉన్నదని, అదే 2023లో ఆ ఆత్మహత్యల సంఖ్య 56కు తగ్గిందని కేటీఆర్ చెప్పారు. అంటే 96 శాతం తగ్గుదల నమోదైందని అన్నారు. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే.. 2023 నాటికి అది 0.51 శాతం తగ్గిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైందని విమర్శించారు. రెండేళ్లలోనే 700 మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు.



## నోబెల్ శాంతి బహుమతి దక్కకుంటే.. అది అమెరికాకు అవమానమే

న్యూయార్క్: ఒకవేళ తనకు నోబెల్ శాంతి పురస్కారం దక్కకుంటే, అప్పుడు అది అమెరికాకు అతిపెద్ద అవమానం జరిగినట్లు అవుతుందని డోనాల్డ్ ట్రంప్ అన్నారు. గాజా సంక్షోభం గురించి మాట్లాడుతున్న సమయంలో.. శాంతి ఒప్పందం కుదిరిందని భావిస్తానని, హమాస్ దానికి ఒప్పుకుంటుందో లేదా చూస్తానని, ఒకవేళ ఒప్పుకోకుంటే, అప్పుడు వాళ్ల పరిస్థితి దారుణంగా ఉంటుందని, అన్ని అరబ్ దేశాలు ఆ ప్లాన్‌కు అంగీకరించాయని, ముస్లిం దేశాలు కూడా ఒప్పుకున్నాయన్నారు. ఇజ్రాయిల్ కూడా తమ డీల్‌కు ఓకే చెప్పిందన్నారు.

ఒకవేళ తమ ప్రణాళిక అనుకున్నది అనుకున్నట్లు జరిగితే, గాజా సంక్షోభం ముగిసిపోతే, అప్పుడు తాను 8 సంక్షోభాలను పరిష్కరించిన వ్యక్తిని అవుతానని ట్రంప్ అన్నారు. అది ఓ అద్భుతమని, అలా ఎవరూ చేయలేదని, నోబెల్ శాంతి బహుమతి వస్తుందంటారా.. రాదు అంటూ ట్రంప్ చమత్కరించారు.



## గూగుల్‌ను కోర్టుకు ఈడ్చిన బచ్చన్ ఫ్యామిలీ..

### 4,50,000 డాలర్ల నష్టపరిహారం కేసు దాఖలు

ముంబై: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో సెలబ్రిటీలు ఆందోళనకు గురవుతున్నారు. తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బచ్చన్ ఫ్యామిలీ కోర్టుకు వెళ్లింది. గూగుల్ కంపెనీపై దావా వేసింది. యూట్యూబ్ లాంటి వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్‌కు అనుమతి లేకుండానే తమ స్వరాన్ని, ఇమేజ్‌లను వాడుతున్నట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో అభిషేక్ బచ్చన్, ఆయన భార్య ఐశ్వర్యరాయ్ బచ్చన్ .. గూగుల్ కంపెనీపై సుమారు నాలుగున్నర లక్షల డాలర్ల నష్టపరిహారం కేసు దాఖలు చేశారు. మేథో సంపత్తి హక్కులను దుర్వినియోగం చేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వీడియోలు క్రియేట్ చేస్తున్నారని ఆ జంట ఆరోపించింది. అలాంటి వీడియోలను తొలగించాలని జడ్జీని కోరారు. డీప్‌ఫేక్ వీడియోలతో ఇతర ఏఐ మోడల్స్‌ను కూడా కలుషితం చేస్తున్నట్లు తమ పేపర్స్‌లో పేర్కొన్నారు. సెప్టెంబర్ ఆరో



తేదీన అభిషేక్, ఐశ్వర్య.. కోర్టులో దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## గాజాలో యుద్ధం మాటున చీకటి కోణం..

గాజాలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం రెండేళ్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ యుద్ధంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. యుద్ధంతో తల్లడిల్లుతున్న గాజా (%+ఖుఝ%)లో తీవ్ర దుర్భిక్ష (%+ఖుఝ ్ఖుతీజుఢఅశీఅ%) పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ ఆకలి కేకలు రోజురోజుకూ మిన్నంటుతున్నాయి. సంపూర్ణంగా గాజా మొత్తం కరవు పరిస్థితి ఏర్పడింది. ఆహారం దొరక్క గాజా వాసులు ఆకలితో అల్లాడిపోతున్నారు. కొన్ని దేశాలు గాజాపై ఆహారం జార విడుస్తున్నా అది అందరికీ అంగట్లేదు. చాలా మంది ఆకలికి అలమటిస్తున్నారు. దీంతో కుటుంబం కడుపు నింపేందుకు మహిళలు తమ శరీరాలను తాకట్టుపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.



## రహ్మాత్ నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

హైదరాబాద్,: మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం హైదరాబాద్ రహమత్ నగర్ లో పర్యటించారు. రహమత్ నగర్ డివిజన్ లో పర్యటించిన మంత్రి పార్టీ శ్రేణులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రహమత్ నగర్ డివిజన్ లోని ఇందిరాగాంధీ నగర్ లో కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. రూ. కోటి 53 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామిరెడ్డి, అజారుద్దీన్, సీఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రహమత్ నగర్ డివిజన్ ఇందిరానగర్ ఫేజ్ 2 లో మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. రూ. కోటి 30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. రహమత్ నగర్ డివిజన్ ప్రతిభా నగర్ లో రూ. 99 లక్షల 50 వేలతో నిర్మించనున్న క్మయునిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. బ్రహ్మశంకర్ నగర్ లో కమ్యూనిటీ హాల్, సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. రూ. కోటి 28 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

## ఐసీసీ వుమెన్స్ వరల్డ్ కప్.. భారత్-శ్రీలంక మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు..!

ఐసీసీ వన్డే వుమెన్స్ వరల్డ్ కప్‌కు భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. భారత్-శ్రీలంక మధ్య మంగళవారం తొలి మ్యాచ్ జరిగింది. ఈ ప్రారంభ మ్యాచ్‌ను చూసేందుకు దాదాపు 23వేల మంది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. ఇది ఐసీసీ మహిళల టోర్నమెంట్ గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డు కావడం విశేషం. మంగళవారం జరిగిన మ్యాచ్‌ను 22,843 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. గతేడాది దుబాయిలో జరిగిన వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌కు 15,935 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. తాజాగా ఐసీసీ వుమెన్స్ ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్ 22,843 మంది హాజరయ్యారని.. ఇది ఐసీసీ వుమెన్స్ టోర్నమెంట్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 59 పరుగుల తేడాతో గెలిచి ఈ టోర్నీ గ్రాండ్‌గా ప్రారంభించింది. %దీప్తి శర్మ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళా జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించింది. దీప్తి, అమంజోత్ కౌర్ అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. దాంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 47 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 269 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. దీప్తి బ్యాట్‌తో పాటు బంతితో అద్భుతంగా రాణించింది. మూడు వికెట్లు పడగొట్టింది. శ్రీలంక తరఫున 43 పరుగులతో చమరి అటపట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. నీలాక్షి డిసిల్వా 35, హర్షిత సమరవిక్రమ 29, అచ్చిని కులసూర్య 17 పరుగులు చేశారు. దీప్తి మూడు వికెట్ల పడగొట్టగా.. స్నేహ రాణా, శ్రీ చరణి చెరో రెండు వికెట్లు తీశారు. క్రాంతి గౌడ్, అమంజోత్ కౌర్, ప్రతీకా రావల్‌కు చెరో వికెట్ దక్కింది.



## పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్

హైదరాబాద్,నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్ చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే పోలీసింగ్ సాధ్యమని, ప్రతి పౌరుడు పోలీసుగా భావించి నేరాల గురించి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సజ్జనార్ పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్ అనే కొత్త కాన్సెప్ట్‌ను పరిచయం చేశారు. ఇందులో లా అండ్ ఆర్డర్ నిర్వహణతో పాటు ప్రజల సంక్షేమంపై కూడా దృష్టి పెడతామని ఆయన వివరించారు. దీనిలో భాగంగా సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, అలాగే నకిలీ వస్తువులు, కల్తీ ఆహారం వంటి వాటిపై కూడా దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. అలాగే కొన్ని కీలక అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇందులో డ్రగ్స్ సమస్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టిందని చెప్పారు. డ్రగ్స్‌కు బానిసలైన యువత, కుటుంబాలు నష్టపోకుండా డ్రగ్స్ దందాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్, స్టాక్ అడ్వైజర్ మోసాలు పెరిగాయని, ముఖ్యంగా పెన్షనర్లు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కష్టపడితేనే డబ్బు వస్తుందని, సులభంగా డబ్బు సంపాదించే పద్ధతులను నమ్మవద్దని కోరారు. మరోవైపు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్‌లను, ఇతర ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌లను ప్రచారం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల ఎంతోమంది కుటుంబాలు నష్టపోయాయని గుర్తు చేశారు. ఇక నగరంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని, రోడ్డుపై ప్రజల సమయం తగ్గించేందుకు కృషి చేస్తామని చెప్పారు. డ్రంకెన్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తామని, తాగిన మత్తులో డ్రైవింగ్ చేయడం ఒక రకంగా 'రోడ్ టెర్రరిజం' వంటిదని అభివర్ణించారు. అలాగే ముఖ్యంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఇక నగరంలో నేరాలను తగ్గించడంలో, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటి ప్రాముఖ్యత చాలా ఎక్కువగా ఉందని అన్నారు.

## పెట్టుబడుల లక్ష్యంగా ఫ్రాన్స్‌కు గొట్టిపాటి

అమరావతి,రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం మంగళవారం నుంచి ఫ్రాన్స్‌లో పర్యటించనుంది. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే సీఐఐ సదస్సుకు పారిశ్రామిక వేత్తలను ఈ బృందం ఆహ్వానించనుంది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. దేశ చరిత్రలో తొలిసారి విద్యుత్ చార్జీలు ట్రూ డౌన్ చేసిన ఘనత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిది అని కొనియాడారు. విద్యుత్ సంస్కరణలకు నాంది పలికి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ అందించే పక్రియకు శ్రీకారం చుట్టింది చంద్రబాబే అని తెలిపారు. ప్రతీ ఏటా 5 శాతం మేర పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగ్గట్టుగా ఉత్పత్తిపైనా దృష్టి సారిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.అనైతిక విధానాలతో వ్యవస్థను అస్తవ్యస్తం చేసి ప్రజలపై జగన్ 18వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. జగన్ పాపాలను ఈనాటికీ భరిస్తూనే చార్జీలు తగ్గించి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. జగన్ పీపీఏ రద్దు చేయటం వల్ల ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వాడుకోలేకపోయామని... అంతర్జాతీయ సమాజంలో తలదించుకోవటంతో రూ.9వేల కోట్లు పెనాల్టీ కట్టాల్సి వచ్చిందనని వెల్లడించారు. జగన్ దెబ్బకు పారిపోయిన పెట్టుబడిదారుల్లో తిరిగి నమ్మకం పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో మరింతగా విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సరైన ప్రణాళికలు లేకుండా షార్ట్ టర్మ్ పవర్ కొనుగోళ్లతో ప్రజలపై భారం మోపిందని వ్యాఖ్యానించారు. 17 శాతం ఉన్న షార్ట్ టర్మ్ పవర్ కొనుగోళ్లను కూటమి ప్రభుత్వం 6.8 శాతానికి తెచ్చిందన్నారు. స్వాపింగ్ విధానం ద్వారా పంజాబ్, హర్యానా రాష్ట్రాలతో విద్యుత్ ఇచ్చి పుచ్చుకునే దిశగా పని చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఏఐ, ఐటీ పరిజ్ఞానం ద్వారా వాతావరణ పరిస్థితులు అధ్యయనం చేస్తూ విద్యుత్ డిమాండ్ అంచనా వేయగలుగుతున్నామని మంత్రి తెలిపారు. బ్యాటరీ స్టోరేజీ విధానంతో పాటు, స్వాపింగ్ విధానం, పీఎస్పీ, రెన్యూవల్ ఎనర్జీ, వంటి వినూత్న విధానాలతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ తక్కువ ఖర్చుకే ఇస్తామన్నారు. విద్యుత్ రంగంపై చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో ప్రజలకు ఆదాయం సమకూరుస్తున్నారని అన్నారు.

## విజయ్ పార్టీనే పవర్ కట్ చేయమని కోరిందా?

చెన్నై:తమిళనాడులోని కరూర్ జిల్లాలో టీవీకే అధినేత విజయ్ ప్రచార ర్యాలీలో భారీ తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 40 కి చేరగా సుమారు 80 మంది గాయపడి చికిత్స పొందుతున్నారు! అయితే... దీనిలో కుట్ర కోణం ఉందని టీవీకే ఆరోపిస్తోంది. తమ నేత విజయ్ ర్యాలీ వేదికకు చేరుకున్నప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేశారని పేర్కొంది.దీంతో అభిమానులు ఆయనను చూసేందుకు ముందుకు కదిలారని, ఈక్రమంలోనే తొక్కిసలాట జరిగినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో... తొక్కిసలాటకు ముందు కొంతసేపు కరెంటు సరఫరా నిలిచిపోయినట్లు పలువురు ప్రత్యక్షసాక్షులు చెప్తున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో తమిళనాడు విద్యుత్తు బోర్డు స్పందించింది. కీలక ప్రకటన చేసింది.అవును... టీవీకే ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరగడం వెనుక కుట్ర కోణం ఉందని, విజయ్ ర్యాలీకి వచ్చిన తర్వాత కొంత సమయం పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని ఆ పార్టీ నేతలు చేసిన ఆరోపణలపై తమిళనాడు విద్యుత్తు బోర్డు స్పందించింది. విజయ్ ర్యాలీ సందర్భంగా తాత్కాలికంగా విద్యుత్తు సరఫరా ఆపేయాలని టీవీకేనే తమకు వినతిపత్రం ఇచ్చిందని తెలిపింది.ఈ మేరకు ఆ రాష్ట్ర విద్యుత్తు బోర్డు చీఫ్ ఇంజినీర్ రాజ్యలక్ష్మి స్పందించారు. ఈ సందర్భంగా... సెప్టెంబర్ 27 రాత్రి ఈ-రోడ్డులోని వేలుసామిపురం వద్ద భారీ జనసమూహం ఉంటుందని అంచనా వేస్తూ.. టీవీకే నుండి లేఖ అందిందని రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. అందులో విజయ్ మాట్లాడుతున్నప్పుడు కొంతసేపు విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలని కోరారన్నారు.అయితే ఆ అభ్యర్థనను తాము తిరస్కరించామని రాజ్యలక్ష్మి వెల్లడించారు. మరోవైపు ఈ విషయంపై తమిళనాడు ప్రభుత్వం స్పందిస్తూ.. తొక్కిసలాట జరిగిన వేదిక వద్ద కరెంటు కోత లేదని.. ఆ పార్టీ ఏర్పాటుచేసిన జనరేటర్లలో సమస్య కారణంగా కొన్ని లైట్లు మసకబారాయని జిల్లా కలెక్టర్ వివరణ ఇచ్చారు.

టీవీకే నాయకులపై కేసు నమోదు:

కరూర్ లో టీవీకే పార్టీ అధినేత విజయ్ ప్రచారసభలో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఆ పార్టీ నాయకులు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ దుర్ఘటనపై విచారణకు నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని స్టాలిన్ తెలిపారు.

# కడపలో గ్రూపు రాజకీయాలు.. ఈ వ్యవహారం వెనుక ఉన్నదెవరు?

కడప: కడప జిల్లాలో తెలుగు తమ్ముళ్ళ మధ్య విభేదాలు ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారాయట. నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో వాటిని సెటిల్‌రైట్ చేయడానికి పార్టీ పెద్దలు మల్లగుల్లాలు పడాల్సి వస్తోందంట. అధికారంలో ఉంటే ప్రత్యర్థులపై ప్రతాపం చూపాల్సింది పోయి సొంత పార్టీ నేతల మధ్యనే మొదలైన ఆధిపత్య పోరు ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ కడప జిల్లా టీడీపీలో ఏం జరుగుతోంది? అసలు ఆధిపత్యపోరుకు కారణమేంటి?




కడప జిల్లా టీడీపీలో బహిర్గతమైన ఆధిపత్య పోరు

కడప జిల్లా టీడీపీలో అంతర్గత పోరు బహిర్గతమైంది. జిల్లా పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, ఆయన సతీమణి, కడప టీడీపీ ఎమ్మెల్యే మాధవీ రెడ్డిలను సొంత పార్టీ నేతలు టార్గెట్ చేయడం మొదలుపెట్టారు. ముందు నుంచి పార్టీలో ఉన్న నాయకులను పట్టించుకోకుండా.. పక్కపార్టీల నుంచి వచ్చిన నేతలకు అందలం ఎక్కిస్తున్నారని కడప టీడీపీ సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. కూటమి అధికారం లోకి వచ్చాక జిల్లా టీడీపీ అధ్యక్షుడి చుట్టు కొత్త కోటరీ తయారైందనే టాక్ నియోజకవర్గంలోని నాయకుల మధ్య నడుస్తోందట. వలస నేతలకే పార్టీలో పదవులు, పనులు దక్కుతున్నాయని టీడీపీ సీనియర్లు చేస్తున్న ఆరోపణలు చర్చనీయంశంగా మారాయి.

కడప జిల్లాలో ఉనికి కోసం రెండు దశాబ్దాలు పోరాడిన టీడీపీ

కడప జిల్లాలో రెండు దశాబ్దాలుగా ఉనికి కోసం పోరాడిన టిడిపి.. మొన్నటి ఎన్నికల్లో సొంత జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు షాకిచ్చి అనూహ్యంగా ఐదు స్థానాలు గెలుచుకుంది. నాలుగు స్థానాల్లో టీడీపీ, ఒక్క స్థానంలో బిజెపి అభ్యర్థి గెలిచారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడి హోదాలో శ్రీనివాసులురెడ్డి సొంత పార్టీ నేతలపైనే సీనియర్లు లేదు తొక్క లేదు, తోలు లేదు అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కుంపటిని రాజేస్తున్నాయంట. బీజేపి, జనసేన లను పక్కన పెడితే సొంత పార్టీ టీడీపీలోనే ఎవరికివారుగా తమదే పై చేయి కావాలని నేతలు ఆరాట పడుతున్నారట. ఇదే అంశం ఇప్పుడు కడప కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరును బహిర్గతం చేస్తోందట%ౌ%జిల్లా టీడీపీలో విభేదాలకు జిల్లా టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డితో పాటు కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి వైఖరే కారణమని జిల్లా టిడిపి నేతలు గుర్రుగా ఉన్నారట. ఎన్నికల ముందు ఏకతాటిపై ఉన్న టిడిపి నేతలు తీరా అధికారంలోకి వచ్చాక ఇలా ఎవరికి వారుగా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదనే చర్చ నడుస్తోందట. కడప అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొదలైన విభేధాలు ఇప్పుడు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కాక రేపుతున్నాయట..

మాధవీరెడ్డిపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన కృష్ణారెడ్డి

జిల్లా కేంద్రమైన కడప, దానికి పక్కనే ఉన్న కమలాపురం నియోజకవర్గ నేతల మధ్య ఏమాత్రం సఖ్యత లేదంటున్నారు. ప్రతి వ్యవహారంలో ఉప్పు, నిప్పులా ఉంటున్నారట. ఇటీవల కడప టీడీపీకి చెందిన నేత కృష్ణారెడ్డి ఎమ్మెల్యే మాధవీ రెడ్డిపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. బహిరంగంగా మీడియా కెక్కి విమర్శలు చేశారు. ఇది చాలదన్నట్లు ఎమ్మెల్యే మాధవి రెడ్డికి వ్యతిరేకంగా వర్గం తయారు చేసుకున్న కృష్ణారెడ్డి ఏకంగా కమలాపురం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహా రెడ్డిని కలిసి వినతి పత్రం ఇవ్వడం రెండు నియోజక వర్గాల ఎమ్మెల్యేల మధ్య మరింత వైరాన్ని పెంచినట్లయిందట.

ఈ వ్యవహారం వెనుక ఉండి నడిపిస్తోంది ఎవరు?

ఇప్పటికే కొన్ని విషయాల్లో తొలిసారిగా ఎన్నికైన ఈ నేతల మధ్య వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో అసమ్మతి నేతలు అధిష్టానం వద్దకు వెళ్ళకుండా.. మరో నేత దగ్గరకు వెళ్లడం ఏంటన్న చర్చ నడుస్తోందట. ఈ వ్యవహారాన్ని వెనుక నుండి ఎవరు నడుపుతున్నారనేది కడప టీడీపీలోని మాధవీరెడ్డి వర్గం నేతలకు తెలిసినా అవసరమైనప్పుడు తేల్చుకుందామన్న ధోరణిలో ఉన్నారట. కడప అసెంబ్లీ సెగ్మెంట్‌లోనే కాదు మిగిలిన నియోజక వర్గాల్లో కూడా కొందరు ప్రజా ప్రతినిధులు ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయట.ఇక కూటమి ధర్మాన్ని టిడిపి నేతలు పాటించడం లేదని ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారంటూ, బిజెపి జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఏకంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డిపైన, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పైనా మీడియా వేదికగా విమర్శలు చేశారు. తీరు మార్చుకోకపోతే తాము తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతామంటూ పరోక్షంగా హెచ్చరికలు చేశారు. సొంత పార్టీలోనే కాక కూటమి పార్టీ నేతల మధ్య కూడా విభేదాలు బహిర్గతం కావడం రాజకీయంగా దుమారం రేపుతోందట. కడప జిల్లాలో కడప, కమలాపురం నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను పార్టీ అధిష్టానం సీరియస్ గానే చూస్తోందట. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యేను పిలిపించి వార్నింగ్ ఇవ్వాలనుకుందట.. అయితే అసెంబ్లీ వ్యవహారాల పని ఒత్తిడితో కడప నేతల పంచాయితీని తేల్చే సమయం లేకపోవడంతో ఈ వ్యవహారాన్ని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. పార్టీ పెద్దలు కూడా కడపలో చోటుచేసుకున్న పరిణామాలపై ఆరా తీశారనే ప్రచారం జరుగుతోంది. శృతిమించితే నేతలను కట్టడం చేసేందుకు అధిష్టానం నేరుగా రంగంలోకిదిగే అవకాశం లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. మరి టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ జిల్లా పరిణామాలపై ఎలా స్పందిస్తారో చూడాలి .

# హామీలన్నీ గాలికి ఎగిరిపోయాయి



సిద్ధిపేట,తెలంగాణ కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి గ్యారంటీలకు టాటా చెప్పిండు.. లంకె బిందెలకు వేటపట్టిండు అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. అబద్ధపు హామీలతో నమ్మించి గొంతు కోసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిద్ధిపేట క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొని ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం బాకీ పడింది? ఒక్కొక్క మహిళకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క రైతుకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క ఇంటికి ఎంత బాకీ పడ్డదో తెలిసేలా బాకీ కార్డు విడుదల చేస్తున్నాం అన్నారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు పండుగకు ఊర్లకు వస్తారు. సిద్ధిపేట నియోజకవర్గంలో ప్రతి ఇంటికి బాకీ కార్డు పంపిణీ చేయాలి. గ్రామ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు అందరు కలిసి ప్రతి ఇంటికి పోయి ఈ బాకీ కార్డుని అందజేసి కాంగ్రెస్ పార్టీ ఆ ఇంటికి ఎంత బాకీ పడిందో వివరించాలన్నారు. కాంగ్రెస్ మోసాలను, కాంగ్రెస్ పాలనను ఎండగట్టాలి. ప్రతి ఇంట్లో ఈ చర్చ జరగాలి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కుర్చీలో కూర్చుంటే కేసీఆర్ చేసింది కరెక్ట్ అని రేవంత్ రెడ్డికి అర్థమైంది..ల్గ÷తుబంధు ఇప్పుడైతే రూ. 10000 మేము వస్తే రూ. 15000 ఇస్తామన్నారు. పోయిన వానకాలం రైతు బంధు మొత్తానికే ఎగ్గొట్టిండు. పోయిన యాసంగిలో మూడెకరాల వారికి ఇచ్చిండు మిగతా వాళ్లందరికీ ఎగ్గొట్టిండు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు ఉన్నాయని రూ. 12,000 ఇచ్చిండు. మిగతా మూడు వేలు ఎగ్గొట్టిండు. ప్రతి రైతుకు కాంగ్రెస్ పార్టీ రూ. 75 వేల రైతుబంధు బాకీ పడింది. రైతుబంధు రైతుకి ఇస్తాం. కౌలు రైతుకి ఇస్తామన్నారు. ఒక రూపాయి అయినా కౌలు రైతుకు ఇచ్చారా? కరోనా వచ్చినా కేసీఆర్ ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలు బంద్ పెట్టిండు గాని రైతులకు రైతుబంధు ఆపలేదన్నారు. 97 శాతం మంది రైతులు 10 ఎకరాలలోపే ఉన్నారు. 200 ఉన్న పెన్షన్‌ని కేసీఆర్ 2000 చేసిండు. పదొంతులు పెన్షన్ పెంచిండు కేసీఆర్. కాంగ్రెస్ 4000 పెన్షన్ ఇస్తా అన్నది ఈరోజు వరకు లేదు. అత్తకు, కోడలు ఇద్దరికీ ఇస్తామన్నారు. రేవంత్ రెడ్డివి అన్నీ గజినీకాంత్ మాటలు.. ఇంటికొక మహిళకు రేవంత్ రెడ్డి రూ. 44 వేల బాకీ పడిండు. రూ. 44000 ఇచ్చినంకనే కాంగ్రెస్ వాళ్ళు ఎవరైనా ఓటు అడగాలన్నారు. 100 రోజుల్లో ఇస్తామని చెప్పి 700 రోజులైనా ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చలేదు. మొదటి క్యాబినెట్‌లోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత తెస్తామన్నారు 30 క్యాబినెట్‌లైనా ఊసే లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల అమలు గురించి ఎవరైనా అడుగుతారేమో అని రాహుల్ గాంధీ తెలంగాణ ముఖం చూడట్లేదు. రేవంత్ రెడ్డిని ఎవడు నమ్మిటట్టు లేదని రాహుల్ గాంధీ వచ్చి మాటిచ్చాడు. 4,000 పెన్షన్ ఇప్పిచ్చే గ్యారెంటీ నాది అన్నాడు రాహుల్ గాంధీ. వందరోజుల్లో హామీలు అమలు చేస్తామన్నావు ఏమైంది. అందుకే ఈ బాకీ కార్డును విడుదల చేసాం. 18 ఏళ్లు నిండిన ప్రతి అక్కకు చెల్లెకు మహాలక్ష్మి కింద రూ. 2,500 ఇస్తామన్నారు. మాట్లాడితే మహిళలను కోటీశ్వరులని చేస్తామంటారు. ఎవరైనా అయ్యారా? ఈ బాకీ కార్డు లోకల్ బాడీ ఎన్నికల్లో బ్రహ్మాస్త్రం. ఇది కాంగ్రెస్ పాలిట ఉరితాడు అవుతుందని హరీశ్‌రావు తెలిపారు. యూరియా బస్తాలు ఇచ్చే తెలివి లేదు కానీ ఊరుకో మద్యం దుకాణం పెడతాడట. బ్రూవర్లు పెడతాడట. బెల్ట్ షాపులు పెడతారట. మొత్తానికి తాగుబోతుల తెలంగాణ చేస్తా అంటున్నడు రేవంత్ రెడ్డి. తులం బంగారం ఏమైంది రేవంత్ రెడ్డి? కనీసం కల్యాణ లక్ష్మి చెక్కుల పైసలు ఇస్తలేవు. విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు అన్నారు ఒక విద్యార్థి కైనా ఇచ్చారా. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తా అన్నావ్ కనీసం 5000 ఉద్యోగాలను ఇచ్చేవా రేవంత్ రెడ్డీ అని నిలదీసారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని రాహుల్ గాంధీ అశోక్ నగర్ చౌరస్తాలో చెప్పిండు. నిజమే అని నిరుద్యోగ యువతీ యువకులు నమ్మారు. రాహుల్ గాంధీ మోసం చేశారు. ప్రియాంక గాంధీ హుస్నాబాద్‌లో నిరుద్యోగ భృతి 4000 ఇస్తామన్నారు ఇచ్చారా అని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ చీరలు ఇచ్చారు నేను పట్టుచీరలు ఇస్తా అన్నాడు. పట్టుచీర లేదు ఉన్న చీర కూడా లేదు. మార్పు కాదు ఇది ఏమార్పు. నమ్మించి ఏమార్చి గొంతు కోసిండు రేవంత్ రెడ్డి. నీళ్ల విషయంలో అబద్దాలు, నియామకాల విషయంలో అబద్దాలు, నోరు తెరిస్తే అన్ని అబద్దాలే. కేసీఆర్ కిట్టు బంద్ అయింది. న్యూట్రిషన్ కిట్టు బంద్ అయింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బంద్ అయింది. 9 ఏళ్లలో రూ. 20వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు చెల్లించాడు కేసీఆర్. విద్యార్థులను నిర్లక్ష్యం చేసి ఒక రూపాయి ఇయ్యని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ఫీజులు కట్టకపోతే సర్టిఫికెట్లు లేని పరిస్థితి వచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ డబ్బులు ఇవ్వకపోవడంతో దావఖానాలో సేవలు బంద్ అయ్యాయని అన్నారు. రేవంత్ రెడ్డి కంచ గచ్చిబౌలిలో, బంజారాహిల్స్‌లో, జూబ్లీహిల్స్‌లో భూముల అమ్ముతా అని బయలుదేరిండు. సన్నవడ్లకు రూ. 1300 కోట్ల బోనస్ రేవంత్ రెడ్డి బాకీ పడ్డాడన్నారు. గ్రీన్ ఛానల్ పెట్టి హాస్టళ్లకి నిధులు విడుదల చేస్తానన్నావు కనీసం తిండి పెట్టే పరిస్థితి లేదన్నారు. గుంత పడితే ఫోన్ చేయండి అని ఆర్అండ్ బి మంత్రి కోమటిరెడ్డి అంటారు. కోమటిరెడ్డి నరకమంటే బాగా నరుకుతాడు కానీ గుంతపడని రోడ్డు ఎక్కడైనా ఉన్నదా.. ఫ్యూచర్ సిటీ అని లేని సిటీకి ఆరు లైన్ల రోడ్ వేస్తాడట. ఉన్న రోడ్లను మాత్రం పట్టించుకోరంట. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పర్సంటేజ్ కు భయపడి కాంట్రాక్టర్లు టెండర్లు వేయని పరిస్థితి. పైసలు లేవు అంటాడు. మల్లన్న సాగర్ నుండి మూసిల నీళ్లు పోస్తా అని 7000 కోట్లతో ప్రాజెక్టు ప్రారంభించాడు. ఢిల్లీకి మూటలు కట్టడానికి, కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు తీసుకోవడానికి, బీహార్ ఎన్నికలకు పంపడానికి పైసలు ఉన్నాయి గాని.. ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయడానికి పైసలు లేవు. గోదారి నీళ్లు కాళేశ్వరం ద్వారా కాలువల్లో పారుతుంటే కళ్ళుండి చూడలేని కబోదులు కాంగ్రెస్ నాయకులు. కాంగ్రెస్ ప్రజలను ఇంత దగా చేస్తుందని, ఇంత మోసం చేస్తుందని ప్రజలకు వివరించాలి అని చెప్పారు.

## దుర్గాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ

విజయవాడ, విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వర్షం కారణంగా విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు కాస్త ఇబ్బంది పడ్డారు. ఉచిత దర్శనం క్యూ లైన్‌లో వస్తున్న భక్తులు వానలో తడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్గాష్టమి సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా క్యూ లైన్లలో భక్తులు బారులు తీరారు. వర్షం వచ్చినా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## డిజిపిగా జితేందర్ పదవీవిరమణ

హైదరాబాద్, సాంకేతికతను ఉపయోగించడం, పోలీసులను సమన్వయంగా ఉపయోగించడం ద్వారా తెలంగాణ పోలీసులు అత్యుత్తమంగా పని చేస్తారని పదవీ విరమణ చేసిన డిజిపి జితేంద్ర తెలిపారు. నేషనల్, రాష్ట్ర స్థాయిలలో జరిగిన విపత్తుల నిర్వహణలో ఆయా బృందాల సహకారం ద్వారా ప్రజలను రక్షించడంలో విజయాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. అలాగే కొత్త డిప్యూటీ పోలీస్ జనరల్ శివధర్ రెడ్డిని పరిచయం చేస్తూ.. అతని అనుభవం, ఉగ్రవాద, ఇంటెలిజెన్స్, అర్బన్ పోలీసింగ్‌లో నైపుణ్యం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పోలీస్ సర్వీస్‌లో 33 సంవత్సరాల ఉన్నతమైన సేవల తర్వాత రాష్ట్ర డిజిపి జితేంద్ర పదవీ విరమణ చేశారు. వీడ్కోలు కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ సీనియర్ అధికారులు, మాజీ అధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మీడియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేంద్ర మాట్లాడుతూ.. 'వీడ్కోలు అత్యంత ఉన్నత ప్రమాణాలతో ఏర్పాటు చేసారు. మార్చింగ్, బ్యాండ్ ప్రదర్శనలు, గుర్రాల బృందం ప్రదర్శన అద్భుతంగా జరిగాయి. ఈ కార్యక్రమం ఘనంగా జరిగేందుకు అకాడమీ డైరెక్టర్, సీనియర్ అధికారులు ఎంతో సహకరించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీస్‌లలో తన అనుభవం అద్భుతమైనది అని తెలిపారు. పంజాబ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కి కేటాయింపుపై, ఇక్కడి సీనియర్ అధికారుల మద్దతు, మార్గదర్శకత్వం నాకు గొప్ప స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు తెలంగాణ పోలీస్ మేము మా ఇల్లుగా భావిస్తున్నాం అని జితేంద్ర పేర్కొన్నారు. తమ పదవీకాలంలో సాధించిన విజయాలను చెబుతూ.. గత 15 నెలల్లో రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగా ఉన్నాయి.. నేరాలు అదుపులో ఉన్నాయి. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, అంతర్రాష్ట్ర ముఠాలు, బెట్టింగ్ రాకెట్లు ఇలా అన్ని కంట్రోల్ చేశామన్నారు. తన కుటుంబానికి, సీనియర్ అధికారులు, స్నేహితులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ జితేంద్ర చివరగా.. తెలంగాణ పోలీస్ అభివృద్ధి కొనసాగాలి. నిరంతర శిక్షణ, సాంకేతికత, మానవ సామర్థ్యాల వినియోగం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవ అందించాలని అన్నారు.డిజిపి జితేందర్ పదవీ విరమణ చేశారు. డిజిపిగా 14 నెలలపాటు జితేందర్ పనిచేశారు. రాష్ట్ర పోలీసులు డిజిపి జితేందర్ కు ఫేర్ వెల్ పరేడ్ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. జితేందర్ వీడ్కోలు కార్యక్రమానికి కొత్త డిజిపి శివధర్ రెడ్డి హాజరయ్యారు. సైబర్ క్రైమ్ నార్కోటిక్స్ కఠిన చర్యలు చేపట్టామని డిజిపి జితేందర్ తెలిపారు. పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశామని అన్నారు. అత్యాధునిక సాంకేతికత సాయంతో అనేక నేరాలు ఛేదించామని, కొన్ని సమస్యలను మానవతాకోణంలో పరిష్కరించామని చెప్పారు. బాధితులకు అండగా ఉండేందుకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ సిద్ధం అని కొత్త డిజిపి శివధర్ రెడ్డికి వివిధ విభాగాల్లో చాలా అనుభవం ఉందని తెలియజేశారు. తన అనుభవంతో అద్భుతంగా విధులు నిర్వహిస్తారని భావిస్తున్నానని అన్నారు. తనకు సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. 33 ఏళ్ల పాటు పోలీసు సర్వీసులో ఉన్నానని, నేషనల్ పోలీస్ అకాడమీలో తనను ఎపి కేడర్ కు కేటాయించారని అన్నారు. ఇక్కడి అధికారులు తనకు ఎంతో సహకరించారని, డిజిపిగా ఉన్న 15 నెలల్లో శాంతిభద్రతలు అదుపులోకి తెచ్చానని చెప్పారు. రాష్ట్రంలో నేరాల రేటు తగ్గించేందుకు పలు చర్యలు చేపట్టామని, రాష్ట్ర పోలీసులకు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని కొనియాడారు. కామారెడ్డి, నిజామాబాద్ వరదల్లో అనేకమంది ప్రాణాలను కాపాడామని, నార్కోటిక్స్, సైబర్ క్రైమ్ నేరాల కట్టడికి నిరంతర కృషి చేస్తున్నామని అన్నారు. బెట్టింగ్ మాఫియాపైనా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, నేరాల ఛేదనలో టెక్నాలజీ చాలా కీలకంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 లక్షల సిసి కెమెరాలతో నిఘా ఉందని, సంచలనం సృష్టించిన పలు కేసులను 48 గంటల్లోనే ఛేదించామని స్పష్టం చేశారు. మరణించిన తల్లిని గుర్తుచేసుకుని కంటతడి పెట్టారు.

## లక్ష కోట్ల విలువైన భూములపై కన్ను..

అమరావతి,ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించిన భూముల ప్రస్తుత స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని భావిస్తోంది. దాదాపు లక్ష కోట్ల విలువైన 1,82,270 ఎకరాల భూములను గత 13 ఏళ్లలో ప్రభుత్వం కేటాయించింది. వివిధ అవసరాల పేరు చెప్పి భూములను తీసుకున్నవారు సరైన రీతిలో వినియోగిస్తున్నారా? లేక నిరుపయోగంగా వదిలేశారా? అనేది పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరిశీలన తర్వాత నిరుపయోగంగా ఉంచేసిన భూములను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. సంక్షేమ పథకాలకు ఎక్కువ నిధులు అవసరం అవుతుండటం, అందుకు తగ్గట్లుగా రాష్ట్ర ఆదాయం లేకపోవడంతో సంపద పెంచుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిస్తునారు. ఇందుకోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. పారిశ్రామిక పురోగతి కోసం అని పలు పాలసీలను రూపొందించారు. ఇందులో ఇండస్ట్రియల్ పాలసీతోపాటు విద్యుత్ పాలసీ కూడా ప్రధానం. ఈ రెండింటి వల్ల రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. ఇక గత 16 నెలలుగా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పనిచేయడంతో దాదాపు రూ.10 లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు, ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది.అయితే, ఈ ప్రాజెక్టులు గ్రౌండింగ్ కావాలంటే భూమి కేటాయించాల్సివుంది. ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, ప్రభుత్వ భూమి తగినంతగా అందుబాటులో లేకపోవడం వల్ల కొత్త పరిశ్రమలకు భూముల కేటాయింపు సవాల్ గా మారుతోంది. అదే సమయంలో ఐటీ పరిశ్రమలకు విశాఖలో ఖరీదైన భూములు కారుచౌకగా ప్రభుత్వం అప్పగిస్తోందని విపక్షం రచ్చ చేస్తోంది. దీంతో పరిశ్రమలకు భూముల కేటాయింపుపై ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోందని చెబుతున్నారు. గతంలో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపుల విధానం - 2012 ప్రకారం ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి ప్రస్తుతం 26 జిల్లాల్లో కేటాయించిన భూములు, పారిశ్రామిక పార్కుల్లో ఖాళీ స్థలాలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు.ఉమ్మడి రాష్ట్రంలో భూ కేటాయింపుల విధానం ప్రవేశపెట్టిన తర్వాత దాదాపు 13 ఏళ్లలో విభజిత రాష్ట్రంలో 1,82,270 ఎకరాలను వివిధ రంగాలకు కేటాయించారు. ఇందులో పరిశ్రమల ఏర్పాటుతోపాటు కాలేజీలు, యూనివర్సిటీలు, ఆస్పత్రులు ఇలా ప్రజలకు అవసరమైన సంస్థల ఏర్పాటుకు భూములు కేటాయించారు. గత ప్రభుత్వంలో కూడా వేల ఎకరాలను చౌకగా కేటాయించారని విమర్శలు ఉన్నాయి. అయితే పునఃపరిశీలన పేరుతో ఆ భూములను వెనక్కి తీసుకుంటే వివాదం తలెత్తే అవకాశం ఉందన్న ఆలోచనతో 2012 నుంచి పంపిణీ చేసిన భూములను పరిశీలించాలని నిర్ణయించారు. దీనివల్ల 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం కేటాయించిన భూములు కూడా మళ్లీ పరిశీలించే అవకాశం ఉందని చెబుతున్నారు.ఈ పరిశీలనలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థల వద్ద ఉన్న మొత్తం ప్రభుత్వ భూమి ఎంత? వాటి విలువ ఎంత? భూ కేటాయింపుల ప్రయోజనం నెరవేరిందా? లేదా? ఆ భూముల వల్ల ప్రజలు, ప్రభుత్వానికి ఏమైనా ప్రయోజనం దక్కిందా? దుర్వినియోగమవుతున్నాయా?

# బుల్డోజర్ వర్సెస్ వారసత్వం.. యూపీలో 'పద్మశ్రీ' ఇంటి కూల్చివేతపై దుమారం..



యూపీ:బుల్డోజర్ బాబాగా గుర్తింపు సంపాదించుకున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిర్ణయాన్ని బాధితులు కూడా సమర్థిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. తాను అభివృద్ధికి అండగా ఉంటానని, రాష్ట్రాన్ని దేశంలో అగ్రభాగాన నిలుపుతానని ఎప్పుడో చెప్పారు. ఆ దిశగానే పనులు చేస్తున్నారు. అయితే ఇటీవల వారణాసి నగరంలో మాజీ ఒలింపియన్, హాకీ ఆటగాడు మహమ్మద్ షాహీద్ నివాసంలోని కొంత భాగం అధికారులు కూల్చివేశారు. ఈ ఘటన ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తలకెత్తుకున్నాయి. యోగి పాలనపై తీవ్రంగా మండిపడుతున్నాయి. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ నేతలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

స్వర్ణ పతకం తెచ్చిన షాదీద్ రాయ్..

మహమ్మద్ షాహీద్ 1980 ఒలింపిక్స్‌లో భారత జట్టు తరుపున ఆడి స్వర్ణపతకం తీసుకువచ్చాడు. 2016లో ఆయన మృతి చెందారు. షాహిద్ పూర్వీకుల ఇల్లు వారణాసి నగరంలోని కచేరీ–సంధహా మార్గంలో ఉంది. అయితే యోగి ప్రభుత్వం ఈ రోడ్డును విస్తరించాలని పనులు చేపట్టింది. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణ పనుల్లో ఇంటి కొంత భాగాన్ని అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు. ఈ చర్యపై రాజకీయంగా మాటల యుద్ధాలు మొదలయ్యాయి.

యోగిపై ప్రతిపక్షాల ఫైర్

ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ సోషల్ మీడియాలో స్పందించారు. 'పద్మశ్రీ మహమ్మద్ షాహిద్ రాయ్ ఇంటిని బీజేపీ ప్రభుత్వం నేలమట్టం చేసింది. ఇది కేవలం ఒక వ్యక్తికి చెందిన ఇల్లు మాత్రమే కాదు.. భారతదేశ క్రీడా వారసత్వానికి గుర్తుగా నిలిచిన స్థలం అని, కాశీ నగరంలోని ప్రముఖులను అవమానించే ఈ చర్యను ప్రజలు క్షమించరు.' అని ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. ఇక సమాజ్ వాదీ పార్టీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ కూడా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'బుల్డోజర్ యంత్రాల ద్వారా మానవత్వం, దేశ వీరుల కృషి, గౌరవాన్ని నేలమట్టం చేయడం విచారకరం' అని పేర్కొన్నారు. క్రీడా వారసత్వాన్ని, సామాజిక గుర్తింపును భర్తీ చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

తమకేం అభ్యంతరం లేదన్న షహీద్ భార్య..

ప్రతిపక్షాల మాటల యుద్ధాలు ఇలా ఉంటే.. షాహిద్ భార్య పర్వీన్ షాహిద్ దీనిపై స్పందించారు. 'ఈ కూల్చివేతకు సంబంధించి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మాకు అన్ని విధాలుగా నష్ట పరిహారం అందింది. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సరిపోతుందని మేము భావిస్తున్నాం.' అని ఆమె అన్నారు. షాహిద్ కుటుంబ సభ్యులు కూడా ప్రభుత్వ అభివృద్ధి విధానాలను అర్థం చేసుకున్నట్టు తెలుస్తోంది.

యూపీలో రాజకీయ దుమారం..

ఈ ఘటన తర్వాత సామాజిక, రాజకీయ, క్రీడా వర్గాల నుంచి వివిధ ప్రతిస్పందనలు వచ్చాయి. ఇది కేవలం వారణాసి రోడ్డు విస్తరణ అంశమే కాకుండా, క్రీడా వారసత్వం, ప్రజల గౌరవం, రాజకీయ బాధ్యత వంటి విషయాలను మళ్లీ చర్చకు తెచ్చింది.

# హెచ్–1బీ లాటరీ విధానంలో మార్పులు

వాషింగ్టన్,హెచ్–1బీ కోసం ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతనస్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు. హెచ్–1బీ, ఎల్–1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యూఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు సెనెటర్లు చక్ గ్రాస్లీ, డిక్ డర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు.

కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరికట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈసందర్భంగా వారు వెల్లడించారు. హెచ్–1బీ వీసా ల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్–1బీ వీసా పై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైమ్




లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్–1బీ వీసాకు దరఖాస్తు చేసుకునేవారికే అమలుచేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు. దీనిని ఉద్దేశించి వాణిజ్య మంత్రి మాట్లాడారు. నుంచి ఈ పక్రియ అంతా అమల్లోకి వస్తుంది. నా అంచనా ప్రకారం ఇప్పుడు.. 2026లో గణనీయమైన మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా రానున్న రోజుల్లో ఆ వీసాపై వచ్చే వారి సంఖ్యలో మార్పు ఉంటుందని అంచనా వేశారు. లాటరీ విధానంలో కూడా మార్పులు ఉండొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం లాటరీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను తెచ్చుకోవడం ఏంటని ప్రశ్నించారు. పాత వీసా విధానంలో లోపాలున్నాయని, ఫలితంగా అనుభవం లేని టెక్ కన్సల్టెన్సీలు దేశంలో కుటుంబాలతో సహా ప్రవేశించాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

# అందుకే యుద్ధానికి వెనక్కి తగ్గాం.. చిదంబరం సంచలన వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ,'26/11 ముంబై టెర్రరిస్ట్ దాడులు' తలుచుకుంటే ఒక్కసారిగా నరాలు ఉడికిపోతాయి. ఈ దాడులు భారతదేశానికి మాత్రమే కాదు, అంతర్జాతీయ సమాజాన్ని సైతం తీవ్ర షాక్ కు గురి చేసింది. దేశ భద్రతను ప్రశ్నించేవిగా మారాయి. ఆ దాడుల్లో ప్రాణనష్టం తీవ్రంగా జరిగింది. అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం ఈ దాడుల గురించి ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. '26/11 దాడుల తర్వాత తీవ్ర కోపోద్రేక్తమైన భారత్ పాక్‌పై యుద్ధం ప్రకటించాలని అనుకుంది. అయితే, ఆ దశలో కొన్ని అంతర్జాతీయ, రాజకీయ కారణాల వల్ల యుద్ధానికి వెనక్కి తగ్గాల్సి వచ్చింది' అన్నారు.

యుద్ధం వద్దన్న అమెరికా..

అప్పటి అమెరికా విదేశాంగ కార్యదర్శి కండోలిజా రైజ్ భారత్ పాక్‌పై దాడి చేసే ఆలోచనలో ఉన్నట్లు గమనించి అంతర్జాతీయ పరిణామాల కారణంగా శాంతియుత రీతిలో పరిష్కరించాలని సూచించారు. 'అందుకే ఆ యుద్ధ నిర్ణయం వెంటనే అమలు చేయలేదు.' అని చిదంబరం స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు దేశ రాజకీయ వాతావరణంలో దుమారానికి కారణమైంది. ఎందుకంటే ప్రజలకు, మీడియాకు, రాజకీయ పార్టీలకు ఇప్పటి వరకూ పూర్తి సమాచారం తెలియదు.

తీవ్ర చర్చకు దారి తీసిన చిదంబరం వ్యాఖ్యలు..

చిదంబరం వ్యాఖ్యలు భారత రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీశాయి. ఇప్పటికే దేశ వ్యాప్తంగా చివరి దశలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తిరిగి జవసత్వాలు తీసుకురావాలని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలు బీజేపీ అనుకూలంగా మలుచుకుంది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ పైకే ఎక్కు పెట్టారు. జాతీయ భద్రత కంటే మీకు విదేశీయుల మాటలు ఎక్కువగా తోచాయా? అంటూ నిలదీస్తున్నారు. 26/11 తరహా దాడులు జరిగిన సందర్భంలో యుద్ధం చేయాలన్న నిర్ణయం తీసుకొని వెనక్కు తగ్గడం వెనుక మండిపడ్డారు.



కొట్టచ్చినట్లుగా భద్రతా లోపం..

ఇది కేవలం దేశీయ రాజకీయ వ్యవహారం మాత్రమే కాదు, భద్రతా విధానంలో గల అంతర్జాతీయ మానవీయ, రాష్ట్రీయ, వ్యూహాత్మక సమన్వయాల సమస్యను ప్రతిబింబిస్తుందని చిదంబరం వ్యాఖ్యలు గుర్తు చేస్తున్నాయి. ప్రజలు, రాజకీయ విశ్లేషకులు, భద్రతా నిపుణులు ఈ వ్యాఖ్యలను పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి సీరియస్ దాడులకు ప్రతిస్పందనగా వ్యూహాత్మక, సరైన తీర్మానాలు తీసుకోవడంలో అవసరాన్ని మళ్లీ గుర్తుచేసుకున్నారు.

రాజకీయ దుమారం..

చిదంబరం సంచలన వ్యాఖ్యలు రాజకీయ, భద్రతా, అంతర్జాతీయ అంశాలను వెలికితీశాయి. 26/11 దాడుల తర్వాత తీసుకోవలసిన నిర్ణయాలు, అంతర్జాతీయ ఒత్తిళ్ల క్రమంలో భారత వ్యూహాలు, రాజకీయ వ్యూహాల వల్ల సమయానుకూలంగా చర్యలు చేపట్టలేకపోవడాన్ని ఈ వ్యాఖ్యలు వివరిస్తున్నాయి.

# కవిత పార్టీ కోసం ప్రజలు కోరుకుంటారా? అంత నమ్మకం ఇచ్చారా?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత కొత్త చర్చకు తెరలేపిన పేరు. రాష్ట్ర అవతరణ తర్వాత బలమైన రాజకీయ శక్తిగా బీఆర్ఎస్ ఎదిగింది. కీలక నేత కేసీఆర్ కుమార్తెగా ప్రాధాన్యత దక్కించుకుంది కవిత.. అయితే బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ తర్వాత గత కొంతకాలంగా తన రాజకీయ భవిష్యత్తుపై కొత్త సమీకరణాలను ప్రయత్నిస్తున్నారు. తాజాగా లండన్‌లోని ప్రవాస తెలంగాణ వారితో కవిత చేసిన "ప్రజలు కోరుకుంటే కొత్త పార్టీ పెడతాను" అనే వ్యాఖ్యలు రాజకీయ రంగంలో హాట్ టాపిక్ అయ్యాయి. కానీ ప్రజలు నిజంగానే కవిత పార్టీ కోసం కోరుకుంటారా? ఆమెకు ఆ స్థాయి నమ్మకం ఇచ్చారా? అన్నది ఇక్కడి మిలియన్ డాలర్ల ప్రశ్న ఒకటే..

కవిత రాజకీయ ప్రస్థానం – బలం, బలహీనతలు

కల్వకుంట్ల కవిత 2009లోనే తెలంగాణ ఉద్యమ సమయంలో "తెలంగాణ జాగృతి" పేరిట ప్రత్యేక ముద్ర వేశారు. ఉద్యమ స్ఫూర్తిని సాంస్కృతిక రంగంలో కొనసాగిస్తూ బీఆర్ఎస్‌కు అప్రత్యక్షంగా మద్దతు తెచ్చిపెట్టారు. జాగృతి కార్యకలాపాల ద్వారా, తెలంగాణ ఉద్యమంతో ఆమెకు ఒక గుర్తింపు ఉంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావవంతమైన మహిళా నాయకురాలిగా ఆమెకు ఇమేజ్ ఉంది. ప్రవాస తెలంగాణ కనెక్షన్ బలంగా ఉంది. 2019లో నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి ఒక పెద్ద మైనస్. ఇది ఆమెకు స్వతంత్రంగా "మాస్ కనెక్ట్" ఉందా అనే సందేహాన్ని లేవనెత్తుతుంది. కేవలం కుటుంబ వారసత్వం అనే ముద్ర కూడా ఆమెకు ప్రతికూలం కావచ్చు.

కొత్త పార్టీ పెట్టడంలో ఉన్న అవకాశాలు

బీఆర్ఎస్‌ను వీడి కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచన వెనుక కొన్ని సానుకూల అంశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ అంతర్గత విభేదాలు, నాయకత్వ సమస్యలు, కేడర్‌లోని కదలికల వలన బలహీనపడింది. కవిత బీఆర్ఎస్ అసంతృప్తులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఆకర్షించి, ఆ ఖాళీని ఆక్రమించగలదనే భావన కొందరిలో ఉంది. పాత విధానాల కంటే కొత్త పంథాలో పార్టీ నిర్మాణం చేసి, నూతన తరం యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయవచ్చు. తెలంగాణ ఉద్యమ స్ఫూహతో పాటు, మహిళా సాధికారత వంటి అంశాలను ప్రధానంగా ప్రచారం చేయవచ్చు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ఏదైనా కారణం చేత పాలనపై అసంతృప్తి పెరిగితే, ప్రజలు ఒక బలమైన ప్రత్యామ్నాయం కోసం చూస్తారు. ఆ సమయంలో కవిత కొత్త పార్టీ ఒక ఎంపికగా నిలబడవచ్చు. కొత్త పార్టీ సవాళ్లు ఉన్నాయి.. అవకాశాలు ఎంత ఉన్నాయో, సవాళ్లు కూడా అంతే తీవ్రంగా ఉన్నాయి.

ప్రజాదరణలో కొరత

పార్టీ స్థాపనకు ముందు, కవితకు వ్యక్తిగతంగా ఎంతమందిని ఆకర్షించే శక్తి ఉందనేది కీలకం. 2019,2024 ఎన్నికల్లో ఓటమి చూస్తే, ఆమెకు స్వతంత్రంగా భారీ ప్రజా మద్దతు లేదనే వాదన ఉంది. పార్టీ కేవలం ఒక కుటుంబ సభ్యురాలిగా కాకుండా, ప్రజా నాయకురాలిగా ఆమోదం పొందాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుతానికి అధికారంలో ఉంది. బీజేపీ కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత క్రమంగా బలం పెంచుకుంటోంది. ఈ రెండు శక్తివంతమైన జాతీయ పార్టీల మధ్య కొత్త ప్రాంతీయ పార్టీ స్థానం సంపాదించడం అత్యంత కష్టం. తెలంగాణలో ఇప్పటికే కుటుంబ ఆధారిత రాజకీయాలపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. కవిత కొత్త పార్టీ పెడితే, అది కేవలం బీఆర్ఎస్ వారసత్వమే అనే ఆరోపణలు మరోసారి తీవ్రంగా ఎదురవుతాయి. కొత్త పార్టీకి కావలసిన ఫండింగ్, బలమైన నాయకత్వం, ప్రతి జిల్లాలో కేడర్ అన్నీ ఏర్పాటు చేయడం చాలా కష్టసాధ్యం. బీఆర్ఎస్‌లోని కొందరు నాయకులు మద్దతుగా వస్తారా అన్నది ప్రస్తుతానికి స్పష్టం కాలేదు.

కవిత వ్యాఖ్యలలోని విశ్వాసం & వ్యూహం

"ప్రజలు కోరుకుంటే తప్పనిసరిగా పార్టీ పెడతాను" అని చెప్పడం ద్వారా కవిత ఒక రకంగా "సమయం వస్తే నేను సిద్ధమే" అనే సంకేతం ఇచ్చారు. ఇది కేవలం ప్రస్తుత రాజకీయ పరిస్థితిని అంచనా వేస్తూ చేసిన వ్యూహాత్మక వ్యాఖ్యగా చెప్పొచ్చు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో, బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉంది. వెంటనే పార్టీ పెట్టడం కన్నా, రాబోయే మూడు సంవత్సరాల్లో రాజకీయ పరిస్థితులు ముఖ్యంగా బీఆర్ఎస్ బలహీనత, కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి ఎలా మారతాయో బట్టి అడుగు వేస్తానని ఆమె సూచించారు. ప్రజలు తనను కోరుకునే పరిస్థితిని తాను సృష్టించగలదన్న ధీమా కూడా ఆమె మాటల్లో కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు కవిత కోసం ఎదురు చూస్తున్నారనేందుకు స్పష్టమైన సంకేతాలు లేవు. ఆమెకు బలమైన వ్యక్తిగత అభిమాన వర్గం ఉందనే చెప్పలేం. కానీ "కుటుంబం బీఆర్ఎస్ వారసురాలు మహిళా నాయకురాలు" అనే మూడు అంశాలు కలిపి ఆమెకు ఒక ప్రత్యేక అవకాశాన్ని మాత్రం అందిస్తాయి. బీఆర్ఎస్ మరింత బలహీనమై, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే, ఆమెకు తగిన రాజకీయ 'స్పేస్' లభించవచ్చు. మొత్తం మీద, కవిత కొత్త పార్టీ అనేది సాధ్యమైన ఆలోచన అయినా, దానికి ప్రజల ఆమోదం, సమయస్ఫూర్తి.. బలమైన వ్యూహం అవసరం. నేడు కాదు, రాబోయే లోక్‌సభ, స్థానిక ఎన్నికల ముందు రాజకీయ పరిస్థితులు ఎలా మారతాయో అనేదే ఆమె భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

కర్నూలు, పత్తికొండలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ఆటోను లారీ ఢకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుగ్గలి మండలం ముకెల గ్రామానికి చెందిన భూమిక (26), నితిక (5) తల్లీకూతుళ్లు. వారిద్దరూ శిరీష (30)తో కలిసి పండుగ సరుకుల కోసం పత్తికొండకు వచ్చారు. పండుగ, సరుకులు తీసుకుని తమ గ్రామమైన ముక్కెళ్ల గ్రామానికి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు.

# చుక్కలు చూపిస్తున్న బంగారం ధరలు




హైదరాబాద్,2025 దసరా, దీపావళి పండుగల వేళ బంగారం కొనుగోలుదారులకు వరుస షాక్‌లు తలుగుతున్నాయి. పండుగ వేళ పసిడి ధరలు భారీగా పరుగులు పెడుతున్నాయి. మొన్నటి వరకు వందల్లో పెరిగిన గోల్డ్ రేట్స్.. ఇప్పుడు వేలల్లో పెరుగుతోంది. వరుసగా రెండో రోజు వెయ్యిగా పైగా పెరిగింది. నిన్న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1410 పెరగగా.. ఈరోజు రూ.1420 పెరిగింది. అలానే 22 క్యారెట్లపై రూ.1300, రూ.1300 పెరిగింది. దీంతో పసిడి ధర ఆల్‌టైమ్ రికార్డులను నమోదు చేస్తోంది.

బులియన్ మార్కెట్‌లో మంగళవారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,450గా.. 24 క్యారెట్ల ధర రూ.1,18,310గా నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో ఇవే ధరలు కొనాగుతున్నాయి. తులం 50 వేలు ఉన్నప్పుడు ఎక్కువ ధర అనుకున్నారు. ఇప్పుడు ఏకంగా లక్ష 20 వేలకు చేరువైంది. ఇంకొన్నిరోజులు గడిస్తే సామాన్య జనాలు బంగారం గురించి మర్చిపోవాలేమో అని అనిపిస్తోంది. బంగారం పెరుగుల ఇలానే ఉంటుందని ఇటీవల నిపుణులు చెప్పారు. మరికొన్ని నెలల్లో రెండు లక్షల రూపాయలకు వెళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదు. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీ స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా ఈ 10 రో ఓజుల్లో ఏకంగా 16 వేలు పెరిగింది. ఈ రెండు రోజుల్లో వరుసగా వెయ్యి పెరిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.1,51,000గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి ఒక లక్ష 61 వేలుగా నమోదైంది. ధంతేరాస్, దీపావళి సీజన్‌లో బంగారం కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. పండుగ సీజన్‌లో బంగారం, వెండి ధరలు ఇంతలా పెరిగిపోతుండటం సామాన్యులను కలవరపరుస్తోంది. ప్రపంచంలో ఆర్థిక పరిస్థితులు, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు, రూపాయి విలువ, ఫెడ్ వడ్డీ రేట్లు, సెంట్రల్ బ్యాంకు బంగారం రిజర్వులు.. పలు కారణాల వల్ల గోల్డ్ అండ్ సిల్వర్ రేట్స్ ప్రభావితం అవుతాయన్న విషయం తెలిసిందే.

# వైఎస్ షర్మిల వ్యాఖ్యలు దురదృష్టకరం

నెల్లూరు: గడిచిన ఐదేళ్లలో దేవాదాయశాఖ ఎక్కడ ఉందో అర్థం కాలేదని.. భగవంతుడికి భద్రత లేకుండా పాలన సాగిందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శలు బాగోలేవని... మతాన్ని తప్పుపట్టే విధంగా ప్రకటన చేయడం దురదృష్టకరం, బాధాకరమన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇద్దరు బిడ్డలు హిందూమతాన్ని విమర్శించడం బాధాకరమన్నారు. హిందూ మతాన్ని కించపరిచేలా రాష్ట్రంలో జగన్ పాలన సాగిందని వ్యాఖ్యలు చేశారు. హిందూధర్మాన్ని సనాతన ఆచారాలు మరిచిపోయారన్నారు. ఆలయాలకు బదులుగా టాయిలెట్లు కట్టమంటూ కించపరిచే విధంగా మాట్లాడటానికి సిగ్గుగా లేదా అంట్యూ÷ర్ అయ్యారు. 1000 ఆలయాలు కట్టిస్తామని తాము చెబితే, షర్మిల టాయిలెట్లు కట్టమని మాట్లాడటం హిందువులని కించపరిచడమే అని అన్నారు. 'మీ భావం అర్థంకావడం లేదు. సుపరిపాలనలో అన్ని కులాలను గౌరవిస్తాం అని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. అంతర్వేదిలో రథం కాల్చివేశారని.. నాయుడుపేటలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. అనేక దుర్మార్గాలు చేశారని... సనాతన ధర్మాన్ని మంట కలిపారని విమర్శించారు. ప్రస్తుతం అందరూ పవిత్రంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. దేవాదాయ శాఖ పరిరక్షణ కోసం కంకణం కట్టుకుని పని చేస్తున్నామన్నారు. విజయవాడ దుర్గా ఆలయంలో దేదీప్యంగా పూజలు జరుగుతున్నాయని..



భక్తులకు వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. వేదాన్ని రక్షించుకోవాలని, నేర్చుకున్న వారికి వేతనం ఇస్తున్నామని తెలిపారు. పాలకవర్గం, అధికారులు.. ఆగమ పండితుల ఆదేశాల మేరకే పని చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. పూజలు లేని ఆలయాలను దూపదీప నైవేద్యం పథకం కింద పరిరక్షిస్తున్నామని తెలిపారు. భగవన్ నామస్మరణ కోసం ఆలయాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేవాదాయశాఖను ప్రక్షాళన చేస్తున్నామని... 476 ఆలయాలకు పాలకవర్గం ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. రూ.20 కోట్లు ఆదాయం ఉన్న ఆలయాలు ఎనిమిది ఉన్నాయని.. పాలకవర్గం నియామకానికి ఉత్తర్వులు ఇచ్చామన్నారు.

# ఎయిర్‌బస్‌కు గోల్డ్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్

న్యూఢిల్లీ,రాష్ట్రంలో ఎయిర్ బస్‌కు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఏపీ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ప్రోగ్రెసివ్ ఏరోస్పేస్ పాలసీ, ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. మల్టిపుల్ ఏరోస్పేస్ కారిడార్, ఎయిర్‌పోర్టులు, పోర్టులతో అనుసంధానంపై వివరించారు. వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండోతో అన్నీ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఎయిర్‌బస్‌కు గోల్డ్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఎయిర్ బస్ సంస్థ బోర్డు సమావేశానికి హాజరయ్యారు. మేకిన్ ఇండియా కార్యాచరణలో భాగంగా ఎయిర్ బస్ సంస్థ తొలిసారిగా తన బోర్డు సమావేశాన్ని ఢిల్లీలో నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి హాజరైన నారా లోకేశ్ ఏపీకి రావాలంటూ ఎయిర్ బస్ ప్రతినిధులను ఆహ్వానించారు. ఏపీలో ప్రపంచస్థాయి ఏరోస్పేస్ తయారీ కేంద్రం ఏర్పాటుకు లోకేశ్ ఈ సందర్భంగా ప్రతిపాదన చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనువైన భూమి ఉందని వివరించారు. రాష్ట్రంలో ఎయిర్ బస్‌కు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ప్రోగ్రెసివ్ ఏరోస్పేస్



పాలసీ, ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. మల్టిపుల్ ఏరోస్పేస్ కారిడార్, ఎయిర్‌పోర్టులు, పోర్టులతో అనుసంధానంపై వివరించారు. వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండోతో అన్నీ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఎయిర్‌బస్‌కు గ్లోబల్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com